
తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం - 12- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 38 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

## మూగబోయిన మధుర గానం..

# ఎస్. జానకి ఇకలేరు



### 88 ఏళ్ల వయసులో మైసూరు ఆసుపత్రిలో తుదిశ్వాస

- వయోభార సమస్యలతో కన్నుమూసిన ప్రముఖ గాయని
- దాదాపు 50 వేలకుపైగా పాటలతో సంగీత ప్రపంచంలో చెరగని ముద్ర
- నాలుగు జాతీయ అవార్డులు, పద్మభూషణ్‌తో సహా ఎన్నో పురస్కారాల గ్రహీత
- తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో అద్భుత గాన ప్రస్థానం
- ఘంటసాల నుంచి ఎస్.పీ. బాలసుబ్రహ్మణ్యం వరకు పలువురు దిగ్గజాలతో మధుర గీతాలు
- 'సిరిమల్లె పువ్వా' నుంచి 'మాటే మంత్రము' వరకు చిరస్మరణీయ గాన మాధుర్యం
- కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రశాంతంగా కన్నుమూసిన గానకోకిల

7లో

## పోక్సో కేసు పగతో ఆరుగురి హత్య..

# షాబాద్‌లో రక్తచరిత్ర

- బాలిక, ఆమె తల్లి, నానమ్మతో పాటు భార్య, ఇద్దరు చిన్నారులను కిరాతకంగా హత్య చేసిన నిందితుడు
- పోక్సో కేసుపై కక్షతో పథకం ప్రకారం ఒకే రాత్రిలో మారణహోమం
- పరారీలో ఉన్న రాజ్‌కుమార్ కోసం ప్రత్యేక పోలీసు బృందాల గాలింపు.. ఆచూకీ తెలిపిన వారికి రూ.2 లక్షల బహుమతి
- పోక్సో కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంపై షాబాద్ సీఐ, ఎస్ఐ సస్పెన్షన్




2లో

# మేడిగడ్డలో నీటి నిల్వ

# సురక్షితం కాదు..

## నిపుణుల సూచనలతోనే ముందడుగు



- మేడిగడ్డ ఏడో బ్లాక్‌లో పిల్లర్లు కుంగిపోవడంతో బ్యారేజీ భద్రతపై ఆందోళన
- మరమ్మతులు పూర్తయ్యే వరకు గేట్లు తెరిచే ఉంచాలని నిపుణుల సూచన
- గేట్లు మూసి నీటిని నిల్వ చేస్తే మరింత ప్రమాదం జరిగే అవకాశం
- నిపుణుల అభిప్రాయాల ఆధారంగానే పునరుద్ధరణ పనులు చేపడతామని సీఎం స్పష్టం
- జాతీయ, అంతర్జాతీయ నిపుణుల సూచనలను పరిశీలిస్తున్న సాంకేతిక కమిటీ
- ఈ నెలలో పరీక్షలు పూర్తి చేసి పునరుద్ధరణ పనులు ప్రారంభించనున్న ప్రభుత్వం
- కాళేశ్వరం పునరుద్ధరణలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదన్న రేవంత్ రెడ్డి
- ఎన్‌డీఎస్ఏకు పూర్తి సహకారం అందిస్తూ భద్రతకే ప్రభుత్వం తొలి ప్రాధాన్యం

2లో

## మేడిగడ్డ లేకుండానే నీటి ఎత్తిపోతలు సాధ్యం

- విరమణ పొందిన ఇంజనీర్ల లేఖను ప్రస్తావించిన కేటీఆర్
- ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు
- రైతులకు వెంటనే నీరు అందించాలని డిమాండ్



హైదరాబాద్, జూలై 11 (తెలంగాణ ముచ్చట్లు): మేడిగడ్డ బ్యారేజీతో సంబంధం లేకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని విరమణ పొందిన నీటిపారుదల శాఖ ఇంజనీర్లు ప్రభుత్వానికి లేఖ రాశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఆ లేఖలో చేసిన సూచనలను వెంటనే అమలు చేసి రైతులకు సాగునీరు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ విరమణ పొందిన ఇంజనీర్ల అభిప్రాయం ప్రకారం

మిగతా 2లో



## వియత్నాంలో బోటు బోల్తా

- 15 మంది భారతీయుల మృతి
- పలువురు గల్లంతు.. సహాయక చర్యలు ముమ్మరం
- మృతుల్లో తెలుగు రాష్ట్రాల పర్యాటకులు ఉన్నట్లు సమాచారం

7లో

## తెలంగాణకు మూడు బుల్లెట్ రైళ్లు

- ఏడు మార్గాల్లో రాష్ట్రానికి పెద్దపీట
- ప్రధాని చొరవతోనే ప్రాజెక్టులని మంత్రి వ్యాఖ్య
- ప్రయాణ సమయాలు భారీగా తగ్గనున్నాయని వెల్లడి

2లో





తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మేడిగడ్డలో నీటి నిల్వ సురక్షితం కాదు..

**హైదరాబాద్, జూలై 11 (తెలంగాణ ముచ్చట్లు):**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పునరుద్ధరణను జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ (ఎన్డీఎస్ఏ) సిఫారసులు, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నియమించిన సాంకేతిక పర్యవేక్షణ కమిటీ సూచనలకు అనుగుణంగానే చేపడతామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ప్రస్తుతం నీటిని నిల్వ చేయడం సురక్షితం కాదని ఎన్డీఎస్ఏ నివేదిక స్పష్టంగా పేర్కొన్నందునే గోదావరి నుంచి నీటిని ఎత్తిపోసే ప్రక్రియ చేపట్టడం లేదని వెల్లడించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి, కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితులను సమగ్రంగా వివరించారు. బ్యారేజీల రూపకల్పన, నిర్మాణం, నిర్వహణ, ఆపరేషన్, నిర్వహణలో లోపాలున్నాయని ఎన్డీఎస్ఏ తన నివేదికలో స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ 2026 జూన్ 30న ఏర్పాటు చేసిన సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ఎన్డీఎస్ఏ తుది నివేదికను పరిశీలించి పునరుద్ధరణ చర్యలకు మార్గదర్శకాలు రూపొందిస్తుందని సీఎం తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ నిపుణుల అభిప్రాయాలను కూడా కమిటీ పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వానికి తగిన సూచనలు అందిస్తుందని చెప్పారు. ఆ సూచనలను యథాతథంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. మేడిగడ్డ ఏడో బ్లాక్‌లో పిల్లర్లు కుంగిపోవడం వల్ల మొత్తం బ్యారేజీపై ప్రభావం పడిందని, ప్రస్తుత పరిస్థితుల్లో గేట్లు మూసి నీటిని నిల్వ చేయడం వల్ల మరింత ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ఎన్డీఎస్ఏ హెచ్చరించిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మరమ్మతులు పూర్తయ్యే వరకు గేట్లు తెరిచి ఉంచాలని నివేదికలో సూచించినట్లు వివరించారు. నీటిని ఎత్తిపోసేందుకు ముందుగా బ్యారేజీల్లో నిర్దిష్ట స్థాయిలో నీటిని నిల్వ చేయాల్సి ఉంటుందని, అయితే ప్రస్తుతం అది సాధ్యం కాదని సీఎం తెలిపారు. గేట్లు మూసి నీటిని నిల్వ చేస్తే బ్యారేజీల భద్రతకు ముప్పు ఏర్పడటమే కాకుండా దిగువ ప్రాంతాల్లో వరద ప్రమాదం తలెత్తే అవకాశం ఉందని అన్నారు. అందువల్ల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ నిపుణుల సూచనల మేరకే ప్రభుత్వం వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు.

ప్రాజెక్టు పునరుద్ధరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదని, ఎన్డీఎస్ఏ, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, సాంకేతిక పర్యవేక్షణ కమిటీ, ఇతర నిపుణుల సూచనల ఆధారంగానే ముందుకు సాగుతామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నెలలో పరీక్షల ప్రక్రియ పూర్తయిన అనంతరం ముంబయి భారత సాంకేతిక విద్యాసంస్థతో పాటు ఇతర నిపుణుల సూచనల మేరకు పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రభుత్వం ఎన్డీఎస్ఏకు సంపూర్ణ సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణకు మూడు బుల్లెట్ రైళ్లు

**న్యూఢిల్లీ, జూలై 11 (తెలంగాణ ముచ్చట్లు):**

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న ఏడు బుల్లెట్ రైలు మార్గాల్లో తెలంగాణకు మూడు మార్గాలు కేటాయించినట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక చొరవతోనే రాష్ట్రానికి ఈ కీలక ప్రాజెక్టులు లభించాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ దేశంలోనే ప్రధాన బుల్లెట్ రైలు కేంద్రంగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బుల్లెట్ రైలు ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్ర ప్రజల ప్రయాణ విధానంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయని మంత్రి తెలిపారు. అత్యాధునిక సాంకేతికతతో నిర్మించే ఈ మార్గాల ద్వారా ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. వ్యాపారం, పరిశ్రమలు, పర్యాటకం, ఉపాధి అవకాశాల పెరుగుదలకు కూడా ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని పేర్కొన్నారు.

హైదరాబాద్ నుంచి విజయవాడకు బుల్లెట్ రైలు ద్వారా సుమారు గంట పది నిమిషాల్లో చేరుకునే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు. అలాగే ముంబైకి సుమారు రెండు గంటల ఇరవై నిమిషాలు, చెన్నైకి దాదాపు రెండు గంటల్లోనే ప్రయాణం పూర్తి చేయవచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్టులు దేశ రవాణా వ్యవస్థలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతాయని అన్నారు. బుల్లెట్ రైలు ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. రైల్వే మార్గాల విస్తరణ, ఆధునికీకరణ, స్టేషన్ల అభివృద్ధి, భద్రతా చర్యల బలోపేతంపై భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టినట్లు వివరించారు.

ఈ సందర్భంగా విపక్షాలపై కూడా అశ్వినీ వైష్ణవ్ విమర్శలు చేశారు. బుల్లెట్ రైలు ప్రాజెక్టులకు సంబంధించిన కీర్తిని కొందరు తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టుల రూపకల్పన, అమలుకు పూర్తి కీర్తి ప్రధాని నరేంద్ర మోదీకే చెందుతుందని స్పష్టం చేశారు. గత యూపీఏ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే బడ్జెట్‌లో సుమారు రూ.800 కోట్లే కేటాయించగా, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికే రూ.5,000 కోట్ల రైల్వే నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ నిధుల ద్వారానే రాష్ట్రంలో పలు రైల్వే అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.



# మేడిగడ్డ లేకుండానే నీటి ఎత్తిపోతలు సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి 100 రోజుల పాటు రోజుకు రెండు టీఎంసీల చొప్పున నీటిని ఎత్తిపోస్తే మొత్తం 200 టీఎంసీల నీటిని గోదావరి పరివాహక ప్రాంతంలోని వివిధ జలాశయాలకు తరలించే అవకాశం ఉందన్నారు. దీంతో రాష్ట్రంలోని అనేక రిజర్వాయర్లు నిండిపోయి రైతులకు సాగునీటి సమస్య గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. రాష్ట్రంలో నీటి లభ్యత ఉన్నప్పటికీ ప్రభుత్వం నీరు లేదని చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. పంపులను ప్రారంభించకుండా, ఎత్తిపోతల వ్యవస్థను వినియోగించకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. అందుబాటులో ఉన్న సౌకర్యాలను సక్రమంగా వినియోగిస్తే రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు.

ప్రస్తుత నీటి కొరత సహజసిద్ధంగా ఏర్పడిన పరిస్థితి కాదని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని కేటీఆర్ ఆరోపించారు. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. సాగునీటి నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. విరమణ పొందిన ఇంజనీర్లు సూచించిన సాంకేతిక అంశాలను ప్రభుత్వం పరిశీలించి వెంటనే నీటి ఎత్తిపోతలను ప్రారంభించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించి వ్యవసాయానికి అవసరమైన నీటిని అందించాలని కోరారు. రాష్ట్రంలో సాగునీటి సమస్య మరింత తీవ్రమవకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. నీటి నిర్వహణపై ప్రజలకు వాస్తవ పరిస్థితులను వెల్లడించి, రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

# షాబాద్ హత్యలపై సీతక్క దిగ్భ్రాంతి

- **నిందితుడిపై కఠిన చర్యలకు ఆదేశం**
- **బాధిత కుటుంబానికి ప్రభుత్వ అండ**
- **దర్యాప్తు వేగవంతం చేయాలని పోలీసులకు సూచన**

**హైదరాబాద్, జూలై 11 (తెలంగాణ ముచ్చట్లు):**



రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో జరిగిన ఆరుగురు హత్యల ఘటనపై రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాజస్థాన్ పర్యటనలో ఉన్న మంత్రి, ఘటన వివరాలు తెలిసిన వెంటనే సంబంధిత పోలీసు కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి పూర్తి సమాచారం తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా నిందితుడిని వెంటనే అరెస్టు చేసి చట్టప్రకారం అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను మంత్రి ఆదేశించారు. కేసు దర్యాప్తును వేగవంతం చేసి ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా విచారించాలని సూచించారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని సీతక్క భరోసా ఇచ్చారు. బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు మానసిక, సామాజిక పరమైన సహాయాన్ని కూడా కల్పించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.

మహిళలు, చిన్నారుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. నేరస్థులు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని హెచ్చరిస్తూ, బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు.

# పోక్సో కేసు పగతో ఆరుగురి హత్య.. షాబాద్‌లో రక్తచరిత్ర

**హైదరాబాద్, జూలై 11 (తెలంగాణ ముచ్చట్లు):**

పోక్సో కేసులో నిందితుడు పగతో రగిలిపోయాడు. రాక్షసుడిలా మారాడు. వరుసబెట్టి ఆరుగుర్ని అతి కిరాతకంగా హత్య చేశాడు. తనపై ఫిర్యాదు చేసిన బాలిక, ఆమె తల్లి, నానమ్మను మట్టుబెట్టిన ఈ రాక్షసుడు, వారికి మద్దతుగా నిలిచిందనే కోపంతో కట్టుకున్న భార్యను, అభం శుభం తెలియని ఇద్దరు కొడుకుల్నీ కడతేర్చాడు. శుక్రవారం అర్ధరాత్రి ఈ హత్యాకాండ చోటు చేసుకోగా, శనివారం ఉదయం ఈ ఘోరం సంచలనం సృష్టించింది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో ఈ మారణకాండ జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. దైవాలగూడకు చెందిన పార్వతి అరుణ్‌కుమార్, శకుంతల దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రెండో కొడుకైన రాజ్‌కుమార్ (28)కు చదువు సంధ్యా లేదు. జులాయిగా తిరిగేవాడు. తల్లిదండ్రులను బెదిరించడం..ఉన్న ఆస్తులు అమ్ముకోవడం, అప్పులు చేయడం, ఖరీదైన కార్లలో తిరుగుతూ జల్సాలు చేయడం, యువతులను వేధించడం..ఇదే పని. మరోవైపు ఆన్‌లైన్ గేమ్స్ ఆడి ఆర్థికంగా నష్టపోయాడు. స్నేహితులు, బంధువుల వద్ద రూ.కోటికి పైగా అప్పు చేశాడు. చెల్లించమని అడిగితే మీ పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించేవాడు.



బాలిక



లక్ష్మి



రుక్కమ్మ

ఈ క్రమంలో ఇదే గ్రామానికి చెందిన తనకంటే వయసులో ఐదేళ్లు పెద్దదైన కప్పెర సరిత (32)ను ప్రేమించానంటూ ఆమె వెంటపడ్డాడు. ఆమె కుటుంబసభ్యులు అప్పటికే మరో వ్యక్తితో వివాహం నిశ్చయించినా దాన్ని చెడగొట్టాడు. 2018లో గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో సరితను పెళ్లి చేసుకున్నాడు. ఇందుకు తన తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో భార్యతో కలిసి షాబాద్‌లోని ఇంట్లో కాపురం పెట్టాడు. వారికి పరీక్షిత్ (4), దైవిక్షిత్ (2) పుట్టారు.

షాబాద్‌లో పక్కింట్లో నివసిస్తున్న ఓ కుటుంబంతో రాజ్‌కుమార్ సన్నిహితంగా మెలిగేవాడు. ఆ ఇంట్లో ఉండే బాలిక (17)పై కన్నేశాడు. శంషాబాద్‌లోని కాలేజీకి వెళ్లి వచ్చేటప్పుడు ప్రేమ పేరుతో వేధించేవాడు. ఆమె తండ్రిని మంచి చేసుకునేందుకు నిత్యం మత్తులో ముంచి తేల్చేవాడు. ఏడాది క్రితం బాలిక తండ్రి మరణించడంతో రాజ్‌కుమార్ అకృత్యాలకు అడ్డులేకుండాపోయింది. విషయం తెలియడంతో బాలిక తల్లి లక్ష్మి (38) పద్ధతి మార్చుకోవాలని రాజ్‌కుమార్‌ను పలుమార్లు హెచ్చరించింది. ఫలితం లేకపోవడంతో ఆరు నెలలుగా కూతుర్ని ఇంట్లోనే ఉంచింది. స్వయంగా తానే తీసుకెళ్లి వార్షిక పరీక్షలు రాయించింది.

ఈ సమయంలో బాలికను బలవంతంగా తీసుకెళ్లే ప్రయత్నం చేయడంతో మే 16న లక్ష్మి షాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు మైనర్ కావడంతో పోలీసులు పోక్సో చట్టంలోని సెక్షన్ 78, 351, 11, ఆర్/డబ్ల్యూ12 కింద కేసు నమోదు చేశారు. దీంతో రాజ్‌కుమార్ అజ్ఞాతంలోకి వెళ్లాడు. నిందితుడిని అరెస్టు చేసి, జైలుకు పంపడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉండగా.. కొద్దిరోజుల తర్వాత రాజ్‌కుమార్ ముందస్తు బెయిల్ తెచ్చుకుని బయట తిరగడం ప్రారంభించాడు. ఈ నేపథ్యంలో షాబాద్‌లోని ఇంటిని ఖాళీ చేసి, స్వగ్రామమైన దైవాలగూడకు వచ్చి రెండు నెలలుగా భార్య, పిల్లలతో కలిసి అక్కడే ఉంటున్నాడు.





రాజ్ కుమార్ భార్య సరిత, కుమారులు పరీక్షిత్, దైవిక్షిత్

తనపై పెట్టిన పోక్సో కేసుకు బాలిక కుటుంబ సభ్యులతో పాటు భార్య సరిత కూడా కారణమని భావించిన రాజ్‌కుమార్ ఆమెపై కూడా కక్ష పెంచుకున్నాడు. అందరినీ చంపేస్తానంటూ తరచూ భార్యతో అనేవాడు. శుక్రవారం రాత్రి బిర్యానీ ప్యాకెట్లు, బీరు బాటిళ్లు తీసుకుని దైవాలగూడలోని ఇంటికి చేరుకున్నాడు. పిల్లలకు బిర్యానీ తెచ్చానని భార్యకు చెప్పి స్వయంగా తినిపించాడు. కొద్దిసేపటి తర్వాత భార్యతో గొడవపడి కత్తితో ఆమె గొంతు కోసి చంపేశాడు. ఆ తర్వాత ఇద్దరు కుమారుల గొంతు కోసి మృతదేహాలను మంచంపై పడేశాడు. ఈ సమయంలో అరుపులు, కేకలు బయటకు వినిపించకుండా ఏసీ, కూలర్, టీవీ ఆన్‌చేసి ఉంచాడు.

భార్యాపిల్లల హత్యల అనంతరం పీకల దాకా మద్యం తాగి శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో తన కారులో షాబాద్‌కు చేరుకున్నాడు. పీఆర్ఆర్ స్టేడియంలో కారును పార్కు చేసి స్టేడియం ప్రహరీ దూకి బాలిక ఇంటికి చేరుకున్నాడు. బాలిక తల్లి లక్ష్మి తలుపులు తెరవగా వెంట తెచ్చుకున్న కత్తితో కడుపులో పొడవడంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలి పోయింది. ఈ అలికిడికి మంచంపై నిద్రిస్తున్న బాలిక నానమ్మ రుక్కమ్మ (60) అరవడంతో ఆమె గొంతుకోసి చంపాడు. అక్కడే ఉన్న బాలిక సోదరి (దివ్యాంగురాలు)ని మాత్రం వదిలేశాడు. రాత్రి 11.10 గంటల సమయంలో బాలిక జుట్టు పట్టుకుని ఇంటి నుంచి బయటకు లాక్కెళ్లాడు. ఈ దృశ్యం ఇంటి ముందున్న సీసీ కెమెరాలో రికార్డయింది. బాలికను కారులో ఎక్కించుకుని తాను నివసించిన ఇంటికి 200 మీటర్ల దూరంలో ఉన్న నాగరికుంట చెరువు వద్దకు తీసుకెళ్లాడు. కత్తితో బాలిక గొంతు కోసి హత్య చేశాడు.

అంతకుముందు బాలికపై అత్యాచారానికి పాల్పడినట్టుగా పోస్టుమార్టం నివేదికలో తేలినట్లు తెలిసింది. 11:40 గంటలకు తల్లిదండ్రులకు ఫోన్ చేసిన రాజ్‌కుమార్.. తనపై పోక్సో కేసు పెట్టిన బాలికతో పాటు ఆమె తల్లి, నానమ్మను చంపేశానని, భార్యాపిల్లల్ని కూడా చంపేశానని, తాను కూడా ఆత్మహత్య చేసుకుంటానని చెప్పాడు. దీంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలికతో పాటు లక్ష్మి, రుక్కమ్మ మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి, దైవాలగూడలోని భార్యాపిల్లల మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అయితే రాజ్‌కుమార్.. తొలుత బాలికతో పాటు ఆమె తల్లి, నాన్నమ్మను హత్య చేశాడని, ఆ తర్వాత దైవాలగూడలో భార్య, పిల్లలను హతమార్చాడని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

హంతకుడు రాజ్‌కుమార్ పరారీలో ఉన్నాడని, ప్రత్యేక పోలీసు బృందాలు అతని కోసం గాలిస్తున్నాయని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి విలేకరులకు చెప్పారు. అతని ఆచూకీ తెలిపిన వారికి రూ.2 లక్షల నజరానా అందజేస్తామని అన్నారు. నిందితుడి వివరాలు తెలిస్తే చేవెళ్లలో ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోల్ రూం 8712665324 నంబర్‌కు ఫోన్ చేయాలని, లేదంటే వాట్సాప్ ద్వారా తెలియజేయాలని సూచించారు. శుక్రవారం రాత్రి 11 గంటలకు షాబాద్‌లోని బాలిక ఇంటికి చేరుకున్న రాజ్‌కుమార్..వరుసబెట్టి ఆమె తల్లి లక్ష్మి, నాన్నమ్మ రుక్కమ్మతో పాటు ఆ తర్వాత బాలికను చంపాడని చెప్పారు. అనంతరం దైవాలగూడకు వచ్చి భార్య, పిల్లలను హత్య చేశాడని తెలిపారు. నిందితుడిపై ఏడేళ్లలోపు శిక్షపడే సెక్షన్లు ఉండటంతోనే బెయిల్ వచ్చిందని వివరించారు. బాలిక తండ్రిని కూడా రాజ్‌కుమార్ చంపినట్లు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, ఆయన గుండెపోటుతోనే చనిపోయినట్లు వైద్యుల నివేదికను బట్టి తెలుస్తోందని సీపీ చెప్పారు. పోక్సో కేసు తర్వాత రాజ్‌కుమార్‌ను అరెస్టు చేయకుండా నిర్లక్ష్యం చూపారనే ఆరోపణల నేపథ్యంలో షాబాద్ సీఐ కాంతారెడ్డి, ఎస్ఐ రమేష్‌ను సస్పెండ్ చేసినట్లు సీపీ వెల్లడించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం - 12 - జూలై 2026


## ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు



**పెద్దమందడి,జూలై11(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్ఐఆర్ నమోదు కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొని నమోదు పత్రాలను నింపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గడువులోపు తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.ఓటరు జాబితాలో పేరు, చిరునామా తదితర వివరాలు సక్రమంగా ఉండేలా ప్రతి అర్హుడైన ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా నమోదు ప్రక్రియలో పాల్గొనాలని పిలుపునిచ్చారు .ఈ సందర్భంగా పెద్దమందడి మండల అధ్యక్షుడు సేనాపతి, గ్రామ నాయకులు పురుషోత్తం రెడ్డి, కురుమూర్తి, విష్ణు, బ్రహ్మయ్య, స్టార్ శ్రీను తదితరులు పాల్గొని నమోదు పత్రాలను నింపారు.

## కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు కల్పించాలని కాంగ్రెస్ అభిమానుల విజ్ఞప్తి



**కొత్తకోట,జూలై11(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు, పదవులు కల్పించాలని పార్టీ అభిమానులు, కార్యకర్తలు కోరుతున్నారు. పార్టీ జెండాను భుజాన వేసుకుని రాత్రింబవళ్లు శ్రమించి కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసిన రైతు నాయకుడు వేముల శ్రీనుకు పదవి దక్కకపోవడంపై కొత్తకోట మండలంలోని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కష్టపడిన వారికి ప్రాధాన్యం లభిస్తుందని ఆశించినా, చివరి నిమిషంలో ఇతర పార్టీల నుంచి చేరిన వారికి కీలక పదవులు ఇవ్వడం వల్ల నిబద్ధతతో పని చేసిన కార్యకర్తల్లో నిరాశ పెరుగుతోందని వారు పేర్కొన్నారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించిన వారికి తగిన గుర్తింపు ఇవ్వకపోతే క్షేత్రస్థాయిలో కార్యకర్తల ఉత్సాహం దెబ్బతింటుందని అభిప్రాయపడ్డారు.రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నిబద్ధతతో పనిచేసిన కార్యకర్తలకు గౌరవం, బాధ్యతలు అప్పగించి పార్టీని మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ పార్టీ అభిమానులు విజ్ఞప్తి చేశారు.

## మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆర్థిక సాయం




**పెద్దమందడి,జూలై11(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కురువ మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తరపున బాధిత కుటుంబానికి రూ.5,000/ రూపాయల ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మధిర మంజుల-శ్రీశైలం, ఉప సర్పంచ్ రాములమ్మ అనుమంతు, మాజీ సర్పంచ్ సిద్దయ్య, వార్డు సభ్యులు కొంకలి నరేష్, లక్ష్మిరాజ్, మల్లయ్య, రాజశేఖర్ రెడ్డి, వెంకటయ్య, షౌకత్, పెద్ద మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## భారీగా తగ్గిన బంగారం ధరలు

**హైదరాబాద్, జులై 11 (తెలంగాణ ముచ్చట్లు):** బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి శనివారం శుభవార్త అందింది. దేశవ్యాప్తంగా బంగారం ధరలు గణనీయంగా తగ్గాయి. పది గ్రాముల ఇరవై నాలుగు క్యారెట్ల బంగారం ధరపై రూ.490, ఇరవై రెండు క్యారెట్ల బంగారంపై రూ.450, పద్దెనిమిది క్యారెట్ల బంగారంపై రూ.370 తగ్గుదల నమోదైంది.
తాజా ధరల ప్రకారం హైదరాబాద్‌లో పది గ్రాముల ఇరవై నాలుగు క్యారెట్ల బంగారం ధర రూ.1,44,330కు చేరుకోగా, ఇరవై రెండు క్యారెట్ల బంగారం ధర రూ.1,32,300గా నమోదైంది. పద్దెనిమిది క్యారెట్ల బంగారం ధర రూ.1,08,250గా ఉంది. తెలంగాణలోని వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ నగరాల్లోనూ ఇదే ధరలు కొనసాగుతున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, కడప నగరాల్లో కూడా బంగారం ధరలు ఒకే స్థాయిలో నమోదయ్యాయి.

# భీమదేవరపల్లి ప్రభుత్వ పాఠశాలకు రూ.50 వేల విలువైన వాటర్ కూలర్ విరాళం



**భీమదేవరపల్లి, జూలై 11, తెలంగాణ ముచ్చట్లు :** భీమదేవరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన చల్లని తాగునీరు అందించాలనే లక్ష్యంతో రూ.50 వేల విలువైన 80 లీటర్ల సామర్థ్యం గల బ్లూ స్టార్ వాటర్ కూలర్‌ను శనివారం నాడు దాతల సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ సేవా కార్యక్రమానికి మార్పాటి వెంకట రాజి రెడ్డి, మార్పాటి జయప్రకాశ్ రెడ్డి, మార్పాటి ప్రదీప్ రెడ్డి, మార్పాటి ప్రవీణ్ రెడ్డి ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎన్. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని దాతలు అందించిన ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సమాజంలో మరింత మంది దాతలు విద్యాభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎన్. భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు సుధారాణి, ప్రదీప్ కుమార్, రాజేంద్రం, మోహన్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొని దాతలను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విద్యార్థులు సైతం దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు.





# ఘనంగా చిల్డ్రన్స్ పార్లమెంట్ వార్షిక దినోత్సవం

- గ్రామ సమస్యల పరిష్కారంలో చిన్నారుల చొరవ ప్రశంసనీయం.

**అశ్వారావుపేట, జూలై 11(తెలంగాణ ముచ్చట్లు):** ములకలపల్లిలో గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ పార్లమెంట్ సభ్యుల వార్షిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పొగలపల్లి, తిమ్మంపేట, చోటిగూడెం, కంపగూడెం, ములకలపల్లి, మాదారం, జగన్నాధపురం, మొగరాలగుప్ప, మోటుగూడెం, గొల్లగూడెం గ్రామాలకు చెందిన చిల్డ్రన్స్ పార్లమెంట్ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలసభ మంత్రులు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం గ్రామసభల్లో పాల్గొని వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి సహకరించిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు. మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి, ములకలపల్లి సర్పంచ్ కోర్సా చంద్రలేఖ, పొగలపల్లి సర్పంచ్ మడకం రవి, మాదారం సర్పంచ్ సుజాత మాట్లాడుతూ చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో విద్యను అభ్యసించడంతో పాటు గ్రామ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం శ్రమించాలని సూచించారు. అలాగే పాఠశాలల్లో నిర్వహించే పేరెంట్ -టీచర్ సమావేశాలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, తిమ్మంపేట ప్రధానోపాధ్యాయుడు శంకర్, సిస్టర్స్ ఉదయ, రీమా తదితరులు పాల్గొన్నారు.

# భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామికి బీజేపీ సిద్ధిపేట జిల్లా ఉపాధ్యక్ష పదవి



**భీమదేవరపల్లి, జూలై 1, తెలంగాణ ముచ్చట్లు :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "సంఘటన్ పర్వ్" కార్యక్రమంలో భాగంగా బీజేపీ సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ నూతన జిల్లా కార్యవర్గాన్ని అధికారికంగా ప్రకటించారు.
ఈ కార్యవర్గంలో భీమదేవరపల్లి మండలానికి చెందిన సర్పంచ్ మాచర్ల కుమారస్వామి నీ సిద్ధిపేట జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ అవకాశాన్ని కల్పించిన కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ , రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు , జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ భీమదేవరపల్లి మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ సందర్భంగా స్పందించిన మాచర్ల కుమారస్వామి మాట్లాడుతూ, ఇది కేవలం బాధ్యత కాదు... నాపై పార్టీ ఉంచిన నమ్మకం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలవడానికి, ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకితభావంతో పనిచేస్తాను అని తెలిపారు.
ఈ నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకత్వానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# గౌడ సంఘం ఆస్తుల ధ్వంసంపై ఫిర్యాదు.. విచారణకు ఎక్సైజ్ శాఖ హామీ



**జమ్మికుంట టౌన్ జూలై 11 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట గౌడ సంఘానికి చెందిన నంబర్ దుకాణం పరిధిలో ఉన్న తాటి, ఈత చెట్లను అక్రమంగా జేసీబీతో తొలగించారని ఆరోపిస్తూ గౌడ సంఘం ప్రతినిధులు ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ సీఐకి లిఖితపూర్వక ఫిర్యాదు అందజేసి, జరిగిన ఘటనపై పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.
గౌడ సంఘం ప్రతినిధుల కథనం ప్రకారం, ఒడ్డెరి కొమురయ్య అలియాస్ శివరాత్రి కొమురయ్య అనే వ్యక్తి జేసీబీతో సంఘానికి సంబంధించిన భూమిలో ఉన్న సుమారు 40 ఈత చెట్లు, 10 తాటి చెట్లను పీకివేశారని తెలిపారు. ఈ ఘటన వల్ల సంఘానికి నష్టం వాటిల్లిందని, దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదును స్వీకరించిన ఎక్సైజ్ సీఐ, ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించి పూర్తి స్థాయిలో విచారణ నిర్వహిస్తామని తెలిపారు. విచారణలో వాస్తవాలు నిర్ధారణ అయిన వెంటనే నిబంధనల ప్రకారం బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని గౌడ సంఘం ప్రతినిధులకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ, సంఘానికి చెందిన ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## అల్వాల గ్రామంలో ఎస్ఐఆర్ ఓటర్ల నమోదు కార్యక్రమం – ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి



**పెద్దమండడి,జూలై11(తెలంగాణ ముచ్చట్లు):** భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దమందడి మండలం అల్వాల గ్రామ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఓటర్ల నమోదు, ధృవీకరణ ప్రక్రియ కొనసాగుతోంది .ఈ కార్యక్రమంలో బీఎల్ఓ జి. సుదర్శన్ రెడ్డి, బీఎల్ఓ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి శోభారాణి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కొండారెడ్డి, బుక్ కీపర్ కుప్పిరెడ్డి మాధవి గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి ఫారాలు నింపించడంతో పాటు అవసరమైన సూచనలు అందిస్తున్నారు.అల్వాల గ్రామ ప్రస్తుత ఓటర్ల జాబితా ప్రకారం మొత్తం 1,040 మంది ఓటర్లు ఉండగా, వారిలో సుమారు కొంత మంది మరణించిన, కొందరు పెళ్లిళ్లు చేసుకొని లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లినట్లు గుర్తించారు. మిగిలిన 1,000 మంది అర్హులైన ఓటర్లలో ఇప్పటివరకు 450 మంది ఆన్‌లైన్ ద్వారా, 150 మంది ప్రత్యక్షంగా ఫారాలు నింపడంతో, మొత్తం 600 ఫారాలు బీఎల్ఓకు తిరిగి అందాయి.మరో రెండు రోజుల్లో మిగిలిన 400 మంది ఓటర్ల ఫారాలను పూర్తి చేయాల్సి ఉన్నందున, గ్రామ ప్రజలందరూ తమకు అందిన ఎస్ఐఆర్ ఫారాలను ప్రభుత్వ పాఠశాల వద్దకు తీసుకువచ్చి సక్రమంగా నింపించుకుని వెంటనే బీఎల్ఓకు అందజేయాలని బీఎల్ఓ జి. సుదర్శన్ రెడ్డి గ్రామ ప్రజలను విజ్ఞప్తి చేశారు.

## వాయుసేన శక్తిలో భారత్‌కు మూడో స్థానం



- **వరుసగా ఐదో ఏడాది చైనాపై ఆధిక్యం**
- **ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మరోసారి సత్తా**
- **ఆధునికీకరణతో మరింత బలోపేతం దిశగా అడుగులు**

**న్యూఢిల్లీ, జూలై 11 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన వాయుసేనల జాబితాలో భారత వాయుసేన మరోసారి తన ప్రతిభను చాటుకుంది. వరల్డ్ డైరెక్టరీ ఆఫ్ మోడరన్ మిలిటరీ ఎయిర్‌క్రాఫ్ట్ విడుదల చేసిన 2026 గ్లోబల్ ఎయిర్ పవర్ ర్యాంకింగ్స్‌లో భారత్ మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ క్రమంలో వరుసగా ఐదో ఏడాది కూడా చైనా వాయుసేన కంటే మెరుగైన స్థానం సాధించడం విశేషంగా నిలిచింది. ఈ ర్యాంకింగ్స్‌లో అమెరికా అగ్రస్థానంలో ఉండగా, రష్యా రెండో స్థానంలో నిలిచింది. స్వతంత్ర జాతీయ వాయుసేనల పరంగా అమెరికా, రష్యా తర్వాత ప్రపంచంలోనే మూడో అత్యంత శక్తిమంతమైన వాయుసేనగా భారత వాయుసేన గుర్తింపు పొందింది. భారత వాయుసేనకు 69.4 పాయింట్లు లభించగా, చైనా వాయుసేన 63.8 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ర్యాంకులను నిర్ణయించేందుకు కేవలం యుద్ధ విమానాల సంఖ్యను మాత్రమే కాకుండా వాటి సాంకేతిక సామర్థ్యం, ఆధునిక ఆయుధ వ్యవస్థలు, పైలట్ల శిక్షణ, నిర్వహణ సామర్థ్యం, లాజిస్టిక్స్, భవిష్యత్ ఆధునికీకరణ ప్రణాళికలు వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ సమగ్ర మూల్యాంకనంలో భారత వాయుసేన అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ప్రస్తుతం భారత వాయుసేన వద్ద సుమారు 1,716 విమానాలు ఉన్నాయి. వీటిలో యుద్ధ విమానాలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లు, ప్రత్యేక విధుల కోసం వినియోగించే విమానాలు సమతూకంగా ఉండటం భారత్‌కు ప్రధాన బలంగా నిలిచింది. ఆధునిక సాంకేతికతతో కూడిన యుద్ధ సామర్థ్యం, విభిన్న రకాల వైమానిక వనరులు కూడా ఈ ర్యాంకు సాధించడంలో కీలక పాత్ర పోషించాయి.

అయితే భారత వాయుసేన ముందు ఇంకా కొన్ని సవాళ్లు ఉన్నాయని రక్షణ నిపుణులు పేర్కొంటున్నారు. దేశ భద్రత అవసరాలకు అనుగుణంగా 42 యుద్ధ స్క్వాడ్రన్లు అవసరముండగా, ప్రస్తుతం 29 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ లోటును భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం 180 తేజస్ ఎంకే1ఏ యుద్ధ విమానాల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తోంది. స్వదేశీ రక్షణ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇస్తూ ఆధునిక యుద్ధ విమానాల అభివృద్ధిపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తోంది. రక్షణ రంగంలో స్వావలంబన లక్ష్యంగా చేపడుతున్న కార్యక్రమాలు, స్వదేశీ సాంకేతికత అభివృద్ధి, ఆధునిక ఆయుధ వ్యవస్థల సమీకరణతో భారత వాయుసేన మరింత బలోపేతం అవుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రానున్న సంవత్సరాల్లో ఈ సామర్థ్యం మరింత పెరిగి ప్రపంచ స్థాయిలో భారత వైమానిక శక్తి మరింత ఉన్నత స్థానాన్ని దక్కించుకునే అవకాశాలు ఉన్నాయని వారు విశ్లేషిస్తున్నారు.



## అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు

- **డబుల్ బెడ్రూమ్ గృహాలు పేదలకే**
- **బిఆర్ఎస్ హయాంలో నాయకులకే పథకాలు అంటూ ఏద్దేవా చేసిన పట్టణ కాంగ్రెస్ పార్టీ**



**మంచిర్యాల, జులై, 11 (తెలంగాణ ముచ్చట్లు):** మందమర్రిలో పారదర్శకంగా అందజేస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల అమలులో అవినీతి జరిగిందని ఆరోపణలు చేయడం సరైనది కాదని కాంగ్రెస్ పార్టీ మందమర్రి పట్టణ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి, జిల్లా ఎస్ సి సెల్ చైర్మన్ పై డిమల్ల నర్సింగ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లూరి లక్ష్మణ్ ఆరోపించారు, శనివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ లలో ఇప్పటికే అర్హులైన 250 మందికి ఇళ్లను అందజేశామని మిగతా ఇళ్ల అమలు కోసం ఇటీవల జాబితాను అధికారులు విడుదల చేశారని జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లిన వాటిని సవరించేందుకు మాత్రమే అధికారులు జాబితాను విడుదల చేయడం జరిగిందన్నారు, దీనిపై ఎలాంటి అవగాహన లేకుండా అధికారులను సంప్రదించకుండా ఇష్టానుసారంగా అవినీతి ఆరో పణలు చేయడం సిగ్గుచేటని తెలిపారు, గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో దళిత బంధు పథకం పట్టణంలో ఎంత మంది అర్హులకు అమలు చేశారో తెలుపాలని డిమాండ్ చేశారు, అర్హులైన నిరుపేదలకు కాకుండా టిఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యక ర్తలకు అందజేసి అసలైన నిరుపేదలకు అన్యాయం చేశారని పేర్కొన్నారు, బిసి, మైనార్టీ కార్పొరేషన్ పథకాలలో బి ఆర్ ఎస్ నాయకులు డబ్బులు తీసుకొని అనర్హులకు ఇప్పించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు, అధికారుల పర్యవేక్షణలో వారి పరిశీ లనలో నిజమైన అర్హులకే డబుల్ రూమ్ ఇళ్లను పారదర్శకంగా అందజే సేందుకు మంత్రి వివేక్ వెంకటస్వామి కృషి చేస్తున్నారని జాబితాలో ఎలాంటి తప్పులు ఉన్నా బి ఆర్ ఎస్ నాయకులు అధికారులను సంప్రదించి అనర్హుల వివరాలను ఇవ్వాలని అన్నారు, ప్రభుత్వం పై గాని మంత్రి వివేక్ వెంకటస్వామి పై గాని అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు, ఈ సమావేశంలో మాజీ పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, మంకు రమేష్, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి. పాష, నాయకులు దుర్గం ప్రభాకర్, రాచర్ల గణేష్, బండి శంకర్, వనం నరసయ్య, సట్ల సంతోష్, ఎండి,ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

## హుజురాబాద్‌లో పెట్రోల్ బంక్ వద్ద అగ్నిప్రమాదం

- **అప్రమత్తతతో తప్పిన భారీ ప్రమాదం**



**హుజురాబాద్, జూలై 11 (తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ పట్టణంలో శనివారం రాత్రి పెట్రోల్ బంక్ వద్ద అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వరంగల్ ప్రధాన రహదారిపై పాపయ్యపల్లి క్రాస్‌రోడ్ సమీపంలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

పెట్రోల్ బంక్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక పరికరాలతో మంటలను అదుపులోకి తీసుకురావడంతో భారీ ప్రమాదం తృటిలో తప్పింది. పెట్రోల్ నిల్వ ప్రాంతానికి మంటలు వ్యాపించకుండా సకాలంలో చర్యలు చేపట్టడంతో ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తినష్టం జరగలేదు.

పెట్రోల్ బంక్ యజమాని చొక్కయ్య తెలిపిన వివరాల ప్రకారం, బంక్ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడటంతో మంటలు చెలరేగాయని తెలిపారు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేసి పరిస్థితిని పరిశీలించారు. ఈ ఘటనతో కొంతసేపు ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, అనంతరం పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంది. సమయానికి స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చిన పెట్రోల్ బంక్ సిబ్బంది అప్రమత్తతను స్థానికులు అభినందించారు.

## ఉమ్మడి జిల్లా స్థాయి స్మారక కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం





- **ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని మనోజ్ రావు**

**హుజురాబాద్, జూలై 11(తెలంగాణ ముచ్చట్లు ):** ఉమ్మడి కరీంనగర్-వరంగల్ జిల్లా స్థాయి స్మారక కబడ్డీ టోర్నమెంట్‌ను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సొల్లు సారయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. క్రీ.శే. సమ్మయ్య (రణధీర్) సీఐ, క్రీ.శే. జి. మల్లయ్య, క్రీ.శే. జి. మూర్తి, క్రీ.శే. జి. బాలరాజ్ స్మారకార్థం ఈ టోర్నమెంట్‌ను నిర్వహించారు. టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కబడ్డీ అనేది కేవలం ఒక ఆట మాత్రమే కాదని, ప్రతి క్రీడాకారుడిలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ధైర్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే గొప్ప క్రీడ అని అన్నారు. గెలుపు-ఓటములు క్రీడల్లో సహజమని, వాటిని సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న 48 జట్లకు ఆమె శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతిభను చాటుకుని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇటువంటి క్రీడా పోటీలు యువతలో ఆరోగ్యకరమైన జీవన విధానంతో పాటు ఐక్యత, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, హెచ్ఎం శోభారాణి, వైస్ చైర్‌పర్సన్ అంజలి, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, జిల్లా, మండల కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, పీడీలు, పీఈటీలు, టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సత్య ప్రసన్న జన్మదిన వేడుకలు

- **కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన చైర్ పర్సన్ ,కాంగ్రెస్ నాయకులు**

**హుజురాబాద్, జూలై 11(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి కర్ర సత్య ప్రసన్న వెంకటరామి రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సత్య ప్రసన్న ప్రజా జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని సుహాసిని మనోజ్ రావు ఆకాంక్షించారు. అనంతరం నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# పల్లె ప్రగతి బాట.. పేదలకు అండ!

- ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన
- రూ. 4.38 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**ఖమ్మం బ్యూరో, జులై 11(తెలంగాణ ముచ్చట్లు ):** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని, సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి నిరుపేదకూ పారదర్శకంగా అందిస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. సుమారు రూ. 4.38 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు మౌలిక వసతుల పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ సాయాన్ని అందజేశారు.
ఖమ్మం రూరల్ మండలం ఆరేకోడు గ్రామంలో రూ. 2.24 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఆరేకోడు తండా నుంచి కాచిరాజుగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆరేకోడు తండా గ్రామంలో పీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ నిధులతో గ్రామీణుల తాగునీటి అవసరాల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఇదే వేదికపై గ్రామానికి చెందిన 20 మంది నిరుపేద నివాస రహితులకు ఇండ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటునందిస్తుందని భరోసా ఇచ్చారు.
తిరుమలాయపాలెం మండలం రమణ తండా గ్రామంలో రమణతండా నుంచి ట్యాంక్ బండ్ మీదుగా ములకలపల్లి తిరుమలాయపాలెం బీటీ రోడ్డు వరకు రూ. 1.94 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న లింక్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాల మెరుగుదలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.
తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పేద కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తోందని పేర్కొంటూ, మండల పరిధిలోని 19 మంది లబ్ధిదారులకు సంబంధించిన చెక్కులను అందజేశారు. అదేవిధంగా అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆర్థిక ఇబ్బందులు పడుతున్న 77 మంది లబ్ధిదారులకు రూ. 24.67 లక్షల మొత్తం విలువ కలిగిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఈ సందర్భంగా మంత్రి పంపిణీ చేశారు.
కొక్కిరేణి గ్రామంలో రూ. 20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మౌలిక వసతుల కల్పనలో రాజీ పడే ప్రసక్తే లేదని, ప్రతి పనిలోనూ నాణ్యతా ప్రమాణాలు పక్కాగా పాటించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిధుల కొరత లేకుండా చూస్తామని, కాంట్రాక్టర్లు నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.








# భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలి : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- మార్చి 2027 నాటికి మూడు విడతల్లో పూర్తి చేయాలని ఆదేశం
- సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ శాఖ మంత్రి స్పష్టీకరణ

**ఖమ్మం బ్యూరో, జులై 11(తెలంగాణ ముచ్చట్లు ):** భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీసర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. భూ రీసర్వే, భూ భారతి అమలు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇళ్లు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై మంత్రి శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ఖమ్మం నుంచి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఈ సమీక్షలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, అయితే చట్టం అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో చేరలేకపోయామని అంగీకరించారు. భూ భారతి సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీసర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీసర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని, శుక్రవారమే ముఖ్యమంత్రి ములుగుమాడు గ్రామ రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారని గుర్తుచేశారు.

**మార్చి 2027 నాటికి మూడు విడతల్లో..**

రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో భూ రీసర్వేను పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, దీనిపై ప్రతి నెల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షిస్తామని మంత్రి తెలిపారు. తొలి విడతలో భాగంగా ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే చేపట్టినట్లు చెప్పారు. ఇందుకోసం శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అయితే వీరికి ఉద్యోగం లేదా రెగ్యులరైజేషన్ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. రీసర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ .50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 కలిపి మొత్తం రూ.60 అందజేస్తామని, విధుల్లో చేరని వారికి గడువిచ్చి లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు.

**సాదాబైనామా దరఖాస్తుల తిరస్కరణపై ఆరా...**

ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి, హైకోర్టు సమస్యను కూడా పరిష్కరించినప్పటికీ.. అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందని మంత్రి పేర్కొన్నారు. తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి, నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేస్తూ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన 6,500 రెవెన్యూ సమస్యల్లో 98 శాతం సమస్యలకు భూ రీసర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, ఒక సర్వే నంబరులో కొంత భూమిని ప్రభుత్వ అవసరాలకు సేకరించినప్పటికీ మొత్తం భూమిని నిషేధిత (22A) జాబితాలో ఉంచడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

**గుడిసెల్లో నివసించే వారికే తొలి ప్రాధాన్యం...**

మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, నిధులు విడుదలైనా పనులు చేపట్టని చోట్ల బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అందజేసి, మిగిలిన పనులకు నిధులు విడుదల చేయాలన్నారు. రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేయాలని, ఇందులో గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇసుక, కంకర సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రానున్న ఆగస్టు 15 నాటికి ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా విద్యాశాఖ చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

# 'పేదల కన్నీళ్లు తుడవడమే ప్రభుత్వ లక్ష్యం'

- సీఎంఆర్‌ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం బ్యూరో, జులై 11(తెలంగాణ ముచ్చట్లు ):** ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, పేదల కన్నీళ్లు తుడవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 129 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.35,91,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులతో పాటు, ఖమ్మం రూరల్ మండలానికి చెందిన మూడు కళ్యాణలక్ష్మి చెక్కులను శనివారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా



మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. నిరుపేదలకు వైద్య ఖర్చుల భారం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధిని వేగంగా అందిస్తున్నామన్నారు. అలాగే ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి పథకం ఎంతో ఆసరాగా నిలుస్తోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రైతు ఆశీర్వాద సభతో రైతులకు ఒరిగిందేమీ లేదు

**చింతకాని బీఆర్‌ఎస్ నాయకులు**



**ఖమ్మం బ్యూరో, జులై 11(తెలంగాణ ముచ్చట్లు ):** చింతకాని మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు మంకెన రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన రైతు ఆశీర్వాద సభ రైతుల సమస్యల పరిష్కారానికి కాకుండా టిఆర్‌ఎస్ పార్టీ నాయకుల పై విమర్శలు చేయడానికే పరిమితమైందని ఆరోపించారు.మండలంలో నిర్వహించిన సభ ద్వారా రూ.2 లక్షలలోపు పెండింగ్‌లో ఉన్న రైతు రుణమాఫీపై స్పష్టమైన ప్రకటన వస్తుందని, రెండుసార్లు ఎగ్గొట్టిన రైతు భరోసా నిధులు ఇస్తారని, కెసిఆర్ చింతకాని మండలం పైలెట్ ప్రాజెక్టు కింద దళిత బంధు కింద ఇచ్చిన 10 లక్షలు ను, అర్హులై ఉండి రాని మా దళిత బిడ్డలకు దళిత బందు ఏమైనా ఇస్తారో అని ఎదురు చూశాము. మహిళలకు గృహలక్ష్మి పథకం రూ.2,500 కింద ఇస్తానన్న ఆర్థిక సాయం వంటి ఎన్నికల హామీల అమలుపై సీఎం మాట్లాడతారని మహిళలు, రైతులు ఆశించారని తెలిపారు. అయితే వాటిపై ఎలాంటి స్పష్టత ఇవ్వకుండా సభ మొత్తం రాజకీయ విమర్శలకే పరిమితమైందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాకు తగిన విధంగా కాకుండా స్థానిక నాయకుడిలా వ్యవహరించారని, రేవంత్ రెడ్డి అధికార అహంకారంతో చావు నోట్లో తలకాయ పెట్టి ప్రత్యేక తెలంగాణ సాధించుకున్న కెసిఆర్ పై కారు కూతలు కూయడం తప్ప ఏమీ చేతకాని సీఎం,.. కేటీఆర్, హరీష్ రావు పై అవగాహన లేని మాటలు అసత్య మాటలు మాట్లాడడం తప్ప మరేమీ లేదు, పువ్వాడ అజయ్ కుమార్ పై వ్యక్తిగత దూషణకు చేయడం నీ దిగజారుడుతనం మాటలుగా ప్రజల గమనిస్తున్నారు, పువ్వాడ అజయ్ కుమార్ జిల్లాలో ఒక్కడే మంత్రిగా ఉండి ఖమ్మం జిల్లా ను ఎలా అభివృద్ధి చేశారో ప్రతి ఒక్కరికి తెలుసు, ముగ్గురు మంత్రులు ఉండి దాచుకోవడం దోచుకోవడం తప్ప జిల్లా ప్రజలకు ఏం చేసింది లేదంటూ ప్రజలు బహిరంగనే మాట్లాడుతున్నారు, ప్రభుత్వ నిధులతో నిర్వహించిన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యక్తిగత రాజకీయ వేదికగా మార్చారని అన్నారు. రైతు ఆశీర్వాద సభకు బస్సులు పెట్టి బలవంతంగా తరలించాలని అధికారులకు ఆదేశించినప్పటికీ, ఒక్కొక్క బస్సుకి కేవలం ఐదు ఆరుగురు మాత్రమే రావడంతో రైతులు సభకు రావడానికి విముఖత వ్యక్తం చేశారు, బట్టి విక్రమార్క మూడున్నర లక్షలు మంది సభకు వస్తారని చెప్పగా ఆశించిన స్థాయిలో మహిళలు, రైతులు స్పందించలేదని పేర్కొన్నారు. అంచనాలకు చాలా తక్కువగా ఉండటం సభపై రైతుల అభిప్రాయాన్ని స్పష్టం చేసిందని వ్యాఖ్యానించారు. ఇన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్వహించిన రైతు ఆశీర్వాద సభ రైతుల ఆశీర్వాదాన్ని పొందలేదని, సభ అట్టర్ ఫ్లాప్ కావడంతో కాంగ్రెస్ నాయకులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. జగన్నాధపురం, మత్కేపల్లి రైతులు సభ కోసం భూములను ఇచ్చిన రైతులకు ఇప్పటికైనా ప్రభుత్వం ఇస్తానన్న పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు బొడ్డు వెంకటరామారావు, మాజీ వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు ,మాజీ ఎంపీపీ పోనుగోటి రత్నాకర్ లచ్చగూడెం ఉప సర్పంచ్ పొట్ల సీతయ్య కొదమూరు ఉప సర్పంచ్ చిట్టిమోదు రాంబాబు, కోడుమూరు బిఎల్ఎ రేగుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు

# ఫ్లిప్‌కార్ట్‌పై పోటీ సంఘానికి ఫిర్యాదు

**న్యూఢిల్లీ, జులై 11 (తెలంగాణ ముచ్చట్లు):** దేశీయ ఈవాణిజ్య రంగంలోని ప్రముఖ సంస్థ ఫ్లిప్‌కార్ట్ కొత్త చట్టపరమైన వివాదంలో చిక్కుకుంది. సంస్థ అనుసరిస్తున్న వ్యాపార విధానాలు మార్కెట్లో సమాన పోటీని దెబ్బతీస్తున్నాయని ఆరోపిస్తూ ఆన్‌లైన్ విక్రయదారుల సంఘం భారత పోటీ కమిషన్‌ను ఆశ్రయించింది. ఫ్లిప్‌కార్ట్ పలు నిబంధనలను ఉల్లంఘిస్తోందని ఫిర్యాదులో పేర్కొంది. ఫిర్యాదు ప్రకారం, ఫ్లిప్‌కార్ట్ సుమారు రూ.3,000 కోట్ల వస్తుసేవల పన్నును ఎగవేసి, ఆ మొత్తాన్ని భారీ రాయితీలు ఇవ్వడానికి వినియోగిస్తోందని ఆరోపించారు. దీనివల్ల సాధారణ విక్రయదారులు తీవ్రంగా నష్టపోతుండగా, కొద్దిమంది విక్రయదారులకు మాత్రమే ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తూ మార్కెట్లో అసమాన పరిస్థితులు సృష్టిస్తోందని సంఘం పేర్కొంది.విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి నిబంధనల ప్రకారం సంస్థ కొనుగోలుదారులు, విక్రయదారులను అనుసంధానించే వేదికగా మాత్రమే పనిచేయాల్సి ఉండగా, ఫ్లిప్‌కార్ట్ స్వయంగా వస్తువులను నిల్వ చేసి విక్రయించే విధానాన్ని అమలు చేస్తోందని కూడా ఆరోపించింది. ఈ అంశాలపై ఫ్లిప్‌కార్ట్‌తో పాటు దాని మాతృసంస్థ, అనుబంధ సంస్థల కార్యకలాపాలపై సమగ్ర విచారణ జరపాలని భారత పోటీ కమిషన్‌ను కోరింది. మరోవైపు ఈ ఆరోపణలను ఫ్లిప్‌కార్ట్ పూర్తిగా ఖండించింది. దేశంలోని అన్ని చట్టాలు, నిబంధనలను పాటిస్తూ పారదర్శకంగా వ్యాపారం నిర్వహిస్తున్నామని సంస్థ స్పష్టం చేసింది. నియంత్రణ సంస్థలు చేపట్టే ఏ విచారణకైనా పూర్తి సహకారం అందిస్తామని తెలిపింది. తమ వేదిక ద్వారా దేశవ్యాప్తంగా 14 లక్షలకు పైగా చిన్న, మధ్య తరహా విక్రయదారులు వ్యాపారం నిర్వహిస్తున్నారని గుర్తు చేసింది. త్వరలోనే షేర్ మార్కెట్లో ప్రవేశించేందుకు సంస్థ సన్నాహాలు చేస్తున్న సమయంలో ఈ ఫిర్యాదు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈవాణిజ్య రంగంలో పోటీ నిబంధనలు, వ్యాపార విధానాలపై మళ్లీ చర్చకు దారితీసే అవకాశముందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# నిమ్మ టీతో ఆరోగ్యానికి నూతన ఉత్సాహం..!



ఉదయం నిద్రలేవగానే లేదా సాయంత్రం వేళ ఒక కప్పు నిమ్మ టీ తాగడం చాలామందికి అలవాటుగా మారింది. సువాసన, తేలికపాటి రుచి, తాజాగా అనిపించే గుణాలతో పాటు ఇది కొన్ని ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందించగలదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అయితే సరైన మోతాదులో తీసుకోవడం, అధిక చక్కెరను నివారించడం ముఖ్యమని సూచిస్తున్నారు. నిమ్మకాయలో సమృద్ధిగా ఉండే విటమిన్ సి రోగనిరోధక శక్తికి తోడ్పడుతుంది. టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీర కణాలను హానికర ప్రభావాల నుంచి కొంతవరకు రక్షించడంలో సహాయపడతాయి. వర్షాకాలం, చలికాలంలో గోరువెచ్చగా నిమ్మ టీ తాగడం వల్ల గొంతుకు హాయిగా అనిపించడంతో పాటు శరీరానికి సేద తీరిన భావన కలుగుతుంది. భోజనం అనంతరం తేలికగా నిమ్మ టీ తీసుకుంటే కొందరిలో జీర్ణక్రియ మెరుగుపడవచ్చు. అలాగే తక్కువ కేలరీల పానీయంగా ఉండటంతో బరువు నియంత్రణకు ప్రయత్నించే వారు కూడా దీనిని ఎంచుకుంటారు. అయితే నిమ్మ టీ మాత్రమే బరువు తగ్గించదని, సమతుల ఆహారం, క్రమమైన వ్యాయామం, సరిపడా నిద్ర కూడా అవసరమని నిపుణులు గుర్తుచేస్తున్నారు. అయితే నిమ్మ టీని ఖాళీ కడుపుతో ఎక్కువగా తాగడం వల్ల కొందరిలో ఎసిడిటీ, గుండెల్లో మంట వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అలాగే ఎక్కువ చక్కెర కలపడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు తగ్గిపోతాయి. అందువల్ల తక్కువ చక్కెరతో లేదా చక్కెర లేకుండా తీసుకోవడం మంచిది. రోజుకు ఒకటి లేదా రెండు కప్పుల వరకు నిమ్మ టీ తీసుకోవడం చాలా మందికి అనుకూలంగా ఉంటుంది. అయితే కడుపు పుండ్లు, తీవ్రమైన ఎసిడిటీ లేదా ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా మేరకు మాత్రమే ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## చాయ్ జల్లెడను ఇలా శుభ్రం చేస్తే... కొత్తదానిలా మెరిసిపోతుంది..!

రోజూ చాయ్ తయారీలో ఉపయోగించే జల్లెడపై టీ పొడి, పాలు, చక్కెర అవశేషాలు పేరుకుపోవడం సహజం. వీటిని వెంటనే శుభ్రం చేయకపోతే జల్లెడ రంధ్రాలు మూసుకుపోయి, దుర్వాసన వచ్చే అవకాశం ఉంటుంది. అయితే ఇంట్లోనే ఉండే కొన్ని సాధారణ పదార్థాలతో జల్లెడను సులభంగా శుభ్రం చేయవచ్చు. ముందుగా గోరువెచ్చని నీటిలో కొద్దిగా పాత్రలు కడిగే ద్రావణం వేసి జల్లెడను పది నిమిషాల పాటు నానబెట్టాలి. ఆ తర్వాత పాత టూత్ బ్రష్‌తో మెల్లగా రుద్దితే రంధ్రాల్లో ఇరుక్కున్న టీ పొడి బయటకు వస్తుంది. మరకలు గట్టిగా ఉంటే బేకింగ్ సోడా, నిమ్మరసం కలిపి జల్లెడపై రాసి ఐదు నిమిషాల తర్వాత శుభ్రం చేయాలి. దీంతో నల్లటి మరకలు తగ్గి జల్లెడ మెరిసిపోతుంది. తెల్ల వెనిగర్‌ను నీటిలో కలిపి కొద్దిసేపు నానబెట్టినా జిడ్డు, దుర్వాసన తొలగిపోతాయి. అనంతరం స్వచ్ఛమైన నీటితో బాగా కడిగి పూర్తిగా ఆరిన తర్వాతే మళ్లీ ఉపయోగించాలి. ప్రతి రోజు వాడిన వెంటనే జల్లెడను కడగడం అలవాటు చేసుకుంటే టీ మరకలు పేరుకోకుండా ఉండటమే కాకుండా ఎక్కువకాలం కొత్తదానిలా ఉపయోగించుకోవచ్చు.



# పెరుగులో చక్కెర కలిపి తింటే... ఆరోగ్యానికి మేలా? కీడా?



పెరుగు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఆహారంగా గుర్తింపు పొందింది. ఇందులో ఉండే మంచి బ్యాక్టీరియా జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. అయితే చాలామంది పెరుగులో చక్కెర కలిపి తినడం అలవాటుగా చేసుకుంటారు. ఇలా తినడం వల్ల రుచి పెరిగినా, ఆరోగ్యపరంగా కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పెరుగులో చక్కెర కలపడం వల్ల అదనపు కేలరీలు శరీరంలోకి చేరతాయి. తరచూ ఇలా తీసుకుంటే బరువు పెరగడం, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు లేదా మధుమేహం వచ్చే ప్రమాదం ఉన్నవారు పెరుగులో చక్కెర కలపకుండా ఉండడం మంచిది.

చక్కెరకు బదులుగా తాజా పండ్ల ముక్కలు, ఖర్జూరం లేదా కొద్దిగా తేనె (ఒక సంవత్సరం పైబడిన వారికి మాత్రమే) కలిపి తీసుకుంటే రుచి కూడా ఉంటుంది, పోషక విలువలు కూడా పెరుగుతాయి. అలాగే పెరుగును సాధారణ రూపంలోనే తీసుకోవడం వల్ల అందులోని మంచి బ్యాక్టీరియా ప్రయోజనాలు మెరుగ్గా లభిస్తాయి. రోజూ పరిమిత మోతాదులో పెరుగు తీసుకోవడం జీర్ణక్రియకు, పేగుల ఆరోగ్యానికి, ఎముకల బలానికి మేలు చేస్తుంది. అయితే అధికంగా చక్కెర కలిపి తినే అలవాటు మాత్రం తగ్గించుకోవడం ఆరోగ్యానికి మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

## తెల్ల ప్లాస్టిక్ కుర్చీలు మళ్లీ కొత్తవాటిలా..!



ఇంట్లో, కార్యాలయంలో, ఫంక్షన్లలో ఎక్కువగా ఉపయోగించే తెల్ల ప్లాస్టిక్ కుర్చీలు కొంతకాలానికే పసుపు రంగులోకి మారి పాతవిగా కనిపిస్తాయి. అయితే ఖరీదైన క్లీనర్లు కొనాల్సిన అవసరం లేకుండానే ఇంట్లో ఉండే కొన్ని సాధారణ పదార్థాలతో వాటిని మళ్లీ కొత్తవాటిలా మెరిపించవచ్చు. ముందుగా కుర్చీలపై పేరుకున్న దుమ్ము, మట్టిని పొడి గుడ్డతో లేదా నీటితో తొలగించాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటిలో కొద్దిగా పాత్రలు కడిగే ద్రావణం కలిపి మృదువైన స్పాంజ్‌తో మొత్తం కుర్చీని శుభ్రం చేయాలి. దీంతో సాధారణ మురికి, జిడ్డు సులభంగా తొలగిపోతాయి. పసుపు మరకలు గట్టిగా ఉంటే బేకింగ్ సోడాలో కొద్దిగా నీరు కలిపి ముద్దలా చేసి మరకలపై రాయాలి. పది నుంచి పదిహేను నిమిషాల తర్వాత మృదువైన బ్రష్‌తో రుద్ది కడిగితే మంచి ఫలితం కనిపిస్తుంది. తెల్ల వెనిగర్‌ను సమాన పరిమాణంలో నీటితో కలిపి స్ప్రే చేసి కొన్ని నిమిషాల తర్వాత గుడ్డతో తుడిస్తే జిడ్డు, దుర్వాసన తగ్గడంతో పాటు కుర్చీలు మరింత శుభ్రంగా కనిపిస్తాయి. అలాగే నిమ్మరసం, బేకింగ్ సోడా మిశ్రమం కూడా పాత మరకలను తొలగించడంలో ఉపయోగపడుతుంది. శుభ్రం చేసిన తర్వాత కుర్చీలను ఎక్కువసేపు నేరుగా ఎండలో ఉంచకుండా నీడలో ఆరబెట్టడం మంచిది. బలమైన రసాయనాలు లేదా ఇనుప స్క్రబ్బర్లు వాడితే ప్లాస్టిక్‌పై గీతలు పడే అవకాశం ఉంటుంది. అందుకే మృదువైన స్పాంజ్ లేదా గుడ్డతోనే శుభ్రం చేయాలి. క్రమం తప్పకుండా శుభ్రం చేస్తూ ఈ చిన్న చిట్కాలను పాటిస్తే తెల్ల ప్లాస్టిక్ కుర్చీలు చాలా కాలం పాటు కొత్తవాటిలా మెరిసిపోతూ ఇంటి అందాన్ని మరింత పెంచుతాయి.

# రాత్రి ఈ అలవాట్లు పాటిస్తే... చర్మం సహజ కాంతితో మెరిసే అవకాశం



అందమైన, ఆరోగ్యవంతమైన చర్మం కోసం ఖరీదైన సౌందర్య ఉత్పత్తులే ఒక్కటే మార్గం కాదు. రోజువారీ జీవనశైలిలో కొన్ని మంచి అలవాట్లను అలవరుచుకోవడం ద్వారా కూడా చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు. ముఖ్యంగా రాత్రి పడుకునే ముందు తీసుకునే చిన్నచిన్న జాగ్రత్తలు చర్మ కణాల పునరుద్ధరణకు తోడ్పడతాయని నిపుణులు సూచిస్తున్నారు. రోజంతా ముఖంపై పేరుకుపోయే దుమ్ము, కాలుష్యం, చెమట, మేకప్ వంటి వాటిని పడుకునే ముందు మృదువైన క్లెన్సర్‌తో శుభ్రం చేయడం అవసరం. ముఖం శుభ్రంగా లేకపోతే రంధ్రాలు మూసుకుపోయి మొటిమలు, మచ్చలు వచ్చే అవకాశం ఉంటుంది. అనంతరం చర్మానికి తగిన మాయిశ్చరైజర్ లేదా అలొవెరా జెల్ రాసుకోవడం వల్ల చర్మం తేమను కోల్పోకుండా ఉంటుంది. రాత్రి సమయంలో శరీరం విశ్రాంతి తీసుకునే క్రమంలో చర్మ కణాల పునరుద్ధరణ కూడా జరుగుతుంది. అందుకే ప్రతిరోజూ కనీసం ఏడు నుంచి ఎనిమిది గంటల నాణ్యమైన నిద్ర చాలా ముఖ్యం. సరిపడా నిద్ర లేకపోతే కళ్ల కింద నల్లటి వలయాలు, చర్మం నిస్సత్తువగా కనిపించడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఆహారపు అలవాట్లు కూడా చర్మ ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. రాత్రి తేలికపాటి భోజనం చేయడం, అధిక నూనె, మసాలా, తీపి పదార్థాలను తగ్గించడం మంచిది. అలాగే రోజంతా తగినంత నీరు తాగడం వల్ల శరీరంతో పాటు చర్మం కూడా తేమను నిలుపుకుంటుంది. పడుకునే ముందు ఎక్కువసేపు మొబైల్, కంప్యూటర్ వంటి తెరలను చూడకుండా ఉండడం కూడా మంచిదే. అలాగే దిండు కవర్లను తరచూ మార్చడం, ముఖాన్ని చేతులతో పదేపదే తాకకుండా ఉండడం వల్ల చర్మంపై బ్యాక్టీరియా ప్రభావం తగ్గే అవకాశం ఉంటుంది. అయితే కేవలం రాత్రి అలవాట్లతోనే చర్మం ఒక్కసారిగా మెరిసిపోదు. సమతుల ఆహారం, క్రమమైన వ్యాయామం, సరిపడా నీరు, సూర్యరశ్మి నుంచి రక్షణ, ఒత్తిడి నియంత్రణ వంటి అంశాలను కూడా పాటిస్తే చర్మం సహజ కాంతిని సంతరించుకునే అవకాశం ఉంటుంది. చర్మ సమస్యలు ఎక్కువకాలం కొనసాగితే స్వయంగా మందులు వాడకుండా చర్మవ్యాధి నిపుణుల సలహా తీసుకోవడం ఉత్తమం.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక





# వియత్నాంలో బోటు బోల్తా

- 15 మంది భారతీయుల మృతి
- పలువురు గల్లంతు.. సహాయక చర్యలు ముమ్మరం
- మృతుల్లో తెలుగు రాష్ట్రాల పర్యాటకులు ఉన్నట్లు సమాచారం

**హనోయి, జూలై 11 (తెలంగాణ ముచ్చట్లు):**

వియత్నాంలో ఘోర పడవ ప్రమాదం చోటుచేసుకుంది. పూ క్వాక్ ద్వీపం సమీపంలో పర్యాటకులను తీసుకెళ్తున్న వేగవంతమైన బోటు బోల్తాపడటంతో కనీసం 15 మంది భారతీయులు మృతిచెందారు. ఈ ఘటనలో పలువురు గల్లంతుకాగా, వారిని గుర్తించేందుకు సహాయక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. అధికారుల వివరాల ప్రకారం, బోటులో 32 మంది భారతీయ పర్యాటకులతో పాటు నలుగురు సిబ్బంది ప్రయాణిస్తున్నారు. సముద్రంలో ప్రయాణిస్తున్న సమయంలో బోటు ఒక్కసారిగా బోల్తాపడింది. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక అధికారులు సహాయక బృందాలను ఘటనాస్థలికి పంపించి పలువురిని సురక్షితంగా రక్షించారు.

ఈ ప్రమాదంలో 15 మంది భారతీయులు మృతిచెందినట్లు వియత్నాం అధికారులు ధృవీకరించారు. మృతుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పర్యాటకులు కూడా ఉన్నట్లు ప్రాథమిక సమాచారం వెలువడింది. అయితే వారి పూర్తి వివరాలను అధికారులు ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. బోటు ఎందుకు బోల్తాపడిందనే అంశంపై అధికారులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. సముద్రంలో గల్లంతైన వారి కోసం నౌకలు, ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోంది.

ఈ ఘటనపై వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. ప్రమాదంలో భారతీయులు మృతిచెందిన విషయాన్ని ధృవీకరిస్తూ, స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. ఈ విషాద ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని, సహాయక చర్యలు పూర్తయ్యాక పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## వియత్నాం ప్రమాదంపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

- అధికారులను అప్రమత్తం చేసిన రేవంత్ రెడ్డి
- కేంద్రం, భారత రాయబార కార్యాలయంతో సమన్వయం
- బాధితులకు అన్ని విధాలా సాయం అందించాలని ఆదేశం



**హైదరాబాద్, జూలై 11 (తెలంగాణ ముచ్చట్లు):**

వియత్నాంలో పర్యటనకు వెళ్లిన తెలుగు రాష్ట్రాలకు చెందిన కొందరు పర్యాటకులు బోటు ప్రమాదంలో మరణించారనే సమాచారంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వివరాలు తెలిసిన వెంటనే అధికారులను అప్రమత్తం చేస్తూ సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు.

వియత్నాంలోని పూ క్వాక్ ద్వీపం సమీపంలో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించాలని ముఖ్యమంత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు వియత్నాంలోని భారత రాయబార కార్యాలయ అధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం అందిన నేపథ్యంలో వారి వివరాలను పూర్తిస్థాయిలో నిర్ధారించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షతగాత్రులకు అత్యవసర వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

ప్రమాద బాధితుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. విదేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలుగు ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం ద్వారా సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. బాధితులకు పూర్తి సహాయం అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.

# మూగబోయిన మధుర గానం.. ఎస్. జానకి ఇకలేరు

**హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు):** ప్రముఖ గాయని ఎస్.జానకి కన్నుమూశారు. మైసూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆమె వయసు 88 సంవత్సరాలు. వయోధిక సమస్యలతో ఆమె కన్నుమూసినట్లు మనవరాలు అప్సర విద్యుల ఇన్‌స్టా వేదికగా ప్రకటించారు. దక్షిణ భారత గానకోకిలగా పేరుగాంచిన జానకి అన్ని భాషల్లో కలిపి దాదాపు 50 వేలకు పైగా పాటలను పాడారు. 1938 ఏప్రిల్ 23న గుంటూరు జిల్లా రేపల్లె మండలం పల్లపట్ల గ్రామంలో ఎస్.జానకి జన్మించారు. తెలుగు చలన చిత్రసీమలో ఆణిముత్యాల్లాంటి పాటలకు ఆమె ప్రాణం పోశారు. తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో అద్భుతమైన పాటలను ఆలపించారు. ఆమె గాన మాధుర్యానికి నాలుగు జాతీయ అవార్డులు సహా, వివిధ సినీ అవార్డులు వరించాయి. సంగీత ప్రపంచానికి జానకి చేసిన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. 2013లో పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. లెజెండరీ గాయకులు ఘంటసాల నుంచి బాలసుబ్రహ్మణ్యం వరకూ ఎంతో మంది గాయనీ గాయకులతో కలిసి ఎస్.జానకి అద్భుత గీతాలతో అలరించారు. తెలుగు ప్రేక్షకులు ఎప్పటికీ మరిచిపోలేని పాటలను ఎస్. జానకి ఆలపించారు. తొలిసారి మిమ్మల్ని (శ్రీవారికి ప్రేమలేఖ), మంచు కురిసే వేళలో (అభినందన), అరె ఏమైందీ (ఆరాధన), బంతి చామంతి (అభిలాష), సిరిమల్లె పువ్వా (పదహారేళ్ల వయసు), మౌనమేలనోయి (సాగర సంగమం), ప్రియతమా నా హృదయమా (ప్రేమ), అందాలలో (జగదేకవీరుడు అతిలోకసుందరి), ఈ దుర్యోధన దుశ్శాసన (ప్రతిఘటన), మాటే మంత్రము (సీతాకోకచిలుక), సుందరి నీవే (దళపతి- తెలుగు వెర్షన్) వంటి సూపర్‌హిట్ సాంగ్స్ పాడారు. "ప్రియమైన అమ్మమ్మ, దిగ్గజ గాయని ఎస్.జానకి కన్నుమూశారన్న వార్త తెలియజేయడానికి ఎంతో విచారిస్తున్నా. కుటుంబ సభ్యుల ప్రేమ, ఆప్యాయత మధ్య ప్రశాంతంగా మనల్ని విడిచి వెళ్లిపోయారు. ఆమె అద్భుతమైన జీవితాన్ని గడిపారు. తన గానంతో లక్షల మందికి ఆనందింపజేశారు. ఆమె ఒక దిగ్గజ గాయని. ఆమె పాటలు మధుర జ్ఞాపకాలు. ఈ దుఃఖ సమయంలో మా కుటుంబ ఏకాంతతను గౌరవించాల్సిందిగా అందరినీ కోరుతున్నా" అని అప్సర తెలిపారు.







# వర్షపు నీటిని ఒడిసిపట్టాలి

- ప్రతి అపార్ట్‌మెంట్‌లో వర్షపు నీటి సంరక్షణ తప్పనిసరి
- ఇంజెక్షన్ బోర్ వెల్ ప్రారంభించిన జలమండలి ఎండీ
- ట్యాంకర్లపై ఆధారాన్ని తగ్గించాలని పిలుపు

**హైదరాబాద్, జూలై 11 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీ వర్షపు నీటి సంరక్షణను తప్పనిసరి బాధ్యతగా స్వీకరించాలని హైదరాబాద్ జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. గుట్టల బేగంపేటలోని బీవర్లీ హిల్స్‌లో ఏర్పాటు చేసిన వర్షపు నీటి రీఛార్జ్ వ్యవస్థ, ఇంజెక్షన్ బోర్ వెల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణ అనుమతులు లేదా ఆక్యుపెన్సీ ధ్రువీకరణ పత్రాల కోసం మాత్రమే వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయకుండా, ప్రతి భవనంపై కురిసే వర్షపు నీటిని శాస్త్రీయ పద్ధతిలో భూమిలోకి ఇంకేలా రూఫ్‌టాప్ రేన్‌వాటర్ హార్వెస్టింగ్, ఇంకుడు గుంతలు, రీఛార్జ్ పిట్లను సమర్థంగా వినియోగించాలని సూచించారు.

ప్రతి కుటుంబం, ప్రతి అపార్ట్‌మెంట్ వర్షపు నీటి సంరక్షణను తమ బాధ్యతగా స్వీకరిస్తేనే భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించవచ్చని అశోక్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం, జలమండలి చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే నగరానికి శాశ్వత నీటి భద్రత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గత ఏడాది వేసవిలో సుమారు నాలుగు వేల అపార్ట్‌మెంట్లు ట్యాంకర్ నీటిని వినియోగించగా, ఈ ఏడాది ఆ సంఖ్య దాదాపు 12,500కు చేరిందని వెల్లడించారు. వర్షాలు కురుస్తున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్ బుకింగ్‌లు అధికంగా నమోదవుతున్నాయని చెప్పారు. ఉప్పల్, ఎల్‌బీనగర్, ఎన్‌టీఆర్‌నగర్, మల్కాజిగిరి వంటి ప్రాంతాల్లో ఈ ఏడాది నీటి అవసరం గణనీయంగా పెరిగిందని వివరించారు.

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి పంపిణీ వ్యవస్థలను కూడా విస్తరిస్తున్నామని ఎండీ తెలిపారు. పంపిణీ పైప్‌లైన్లు, రిజర్వాయర్లు, పంపింగ్ వ్యవస్థలు, అంతర్గత నీటి సరఫరా వలయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి వంటి దూర ప్రాంతాల నుంచి భారీ వ్యయంతో నీటిని తరలిస్తున్నామని వివరించారు. ట్యాంకర్ నీటిని శాశ్వత పరిష్కారంగా భావించకూడదని అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. అపార్ట్‌మెంట్ సంఘాలు నీటి వినియోగంపై సమీక్షలు నిర్వహించడం, లీకేజీలను అరికట్టడం, పాడైన బోరుబావులను రీఛార్జ్ పిట్లుగా మార్చడం, వర్షపు నీటిని భూమిలోకి ఇంకించడం ద్వారా ట్యాంకర్లపై ఆధారపడే పరిస్థితిని గణనీయంగా తగ్గించవచ్చన్నారు. బీవర్లీ హిల్స్ అపార్ట్‌మెంట్ వాసులు చేపట్టిన కార్యక్రమాన్ని అభినందిస్తూ, ప్రతి కాలనీ ఇదే స్ఫూర్తితో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# పెదవి శస్త్రచికిత్సలో విషాదం

- చికిత్స అనంతరం 18 నెలల బాలుడి మృతి
- వైద్యుల నిర్లక్ష్యమంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ
- పోలీసుల కేసు నమోదు.. దర్యాప్తు ప్రారంభం

**కన్నూరు, జూలై 11 (తెలంగాణ ముచ్చట్లు):**

కేరళలో 18 నెలల బాలుడి మరణం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పెదవికి గాయమవడంతో శస్త్రచికిత్స కోసం ఆస్పత్రికి తీసుకెళ్లిన చిన్నారికి మత్తుమందు ఇచ్చిన అనంతరం ఆరోగ్య పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు వైద్యుల నిర్లక్ష్యాన్ని ఆరోపించగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కన్నూరు జిల్లాకు చెందిన టి. సూరజ్, విజిషా దంపతుల కుమారుడు దేవాన్ష్ శౌర జూలై 5న ఇంటి వద్ద ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కిందపడటంతో పెదవికి తీవ్ర గాయమైంది. తొలుత సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించిన వైద్యులు, మెరుగైన వైద్యం కోసం పయ్యన్నూరులోని బేబీ మెమోరియల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పెదవి శస్త్రచికిత్స నిర్వహించాలని వైద్యులు నిర్ణయించారు.

శస్త్రచికిత్సకు ముందు చిన్నారికి మత్తుమందు ఇచ్చారు. అనంతరం శస్త్రచికిత్స పూర్తయినప్పటికీ బాలుడు స్పృహలోకి రాకపోవడంతో వెంటనే అత్యవసర చికిత్స ప్రారంభించారు. పరిస్థితి విషమించడంతో కన్నూరులోని బేబీ మెమోరియల్ ఆస్పత్రికి తరలించి వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. అయినప్పటికీ శుక్రవారం రాత్రి చిన్నారి ప్రాణాలు కోల్పోయాడు. చికిత్సలో వైద్యుల నిర్లక్ష్యమే తమ కుమారుడి మరణానికి కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 125 కింద కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈ ఘటనపై ఆస్పత్రి యాజమాన్యం స్పందిస్తూ వైద్యుల నిర్లక్ష్యం ఏమీ జరగలేదని స్పష్టం చేసింది. మత్తుమందు ఇచ్చిన వెంటనే చిన్నారికి అనూహ్యంగా గుండె స్పందన ఆగిపోయిందని, వెంటనే అత్యవసర చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కన్నూరుకు తరలించినట్లు తెలిపింది. అనస్థీషియా ప్రక్రియలో అవసరమైన అన్ని వైద్య ప్రమాణాలు, భద్రతా నిబంధనలు పాటించినట్లు వెల్లడించింది. చిన్నారి మృతి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మత్తుమందు ఇచ్చిన తర్వాత ఏర్పడిన వైద్య సమస్యలపై పోలీసులు, ఆరోగ్యశాఖ అధికారులు అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నారు. దర్యాప్తు నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మూగ-చెవిటి పిల్లల మధ్యలో పల్లా రాజేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**ధర్మసాగర్,జులై11(తెలంగాణ ముచ్చట్లు):**

ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామంలోని లిటిల్ ఫ్లవర్ మూగచెవిటి పిల్లల పాఠశాలలో జనగాం ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలను ధర్మసాగర్ మండల బీఆ ర్ఎస్ యువజన అధ్యక్షుడు రాజారపు సుమన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు.ఈ కార్యక్రమానికి మాజీ మండల అధ్యక్షుడు, జిల్లా నాయకుడు గుడివెనుక దేవేందర్ ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరిపారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారు.



ఈ సందర్భంగా గుడివెనుక దేవేందర్ మాట్లాడుతూ, సమాజంలో ప్రతి చిన్నా రికి సమాన అవకాశాలు కల్పించ డం అందరి బాధ్యత అని అన్నారు. మూగచెవిటి చిన్నారులతో కలిసి జన్మదిన వేడుకలు నిర్వహించడం ఎంతో సం తో షం గా ఉందని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను పెంపొందిస్తాయని, ప్రజా ప్రతినిధుల జన్మదినాలను సేవా కార్య క్రమాలతో నిర్వహించడం ఆదర్శనీయ మని అన్నారు.అనంతరం నాయకులు పిల్లలతో మమేకమై వారితో ఆనందంగా గడిపారు. చిన్నారుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందిం చాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ యువ నాయకులు గుర్రపు ప్రవీణ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.




# ఉపాధ్యాయుల సంక్షేమము పీఆర్టియు తోనే సాధ్యం

## పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షులు మందల తిరుపతిరెడ్డి
## ధర్మసాగర్‌లో పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం

**ధర్మసాగర్,జులై11(తెలంగాణ ముచ్చట్లు):**




పీఆర్టీయూ టీఎస్ ధర్మసాగర్ మండల శాఖ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరా నికి సంబంధించిన సభ్యత్వ నమోదు కార్యక్ర మం మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వ హించారు. ఈ కార్యక్రమాన్ని మండల శాఖ అధ్యక్షుడు అనిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కా ర్యదర్శి జాన్ సింగ్ సమన్వయం చేశారు.ఈ సందర్భంగా పాల్గొన్న హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతి రెడ్డి మాట్లాడు తూ, ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ టీఎస్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఒకప్పుడు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొన్న ఉపాధ్యాయులకు అనేక సంక్షేమ, సేవా ప్రయోజనాలు అందించ డంలో సంఘం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు.

ప్రస్తుతం ప్రభుత్వం పీఆర్సీ, డీఏలు, ఇతర బిల్లుల చెల్లింపుల్లో జాప్యం చేయడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందు లు ఎదుర్కొంటున్నారని అన్నారు. వెంటనే పీఆర్సీ నివేదికను విడుదల చేసి 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీని ప్రభు త్వం ఇప్పటికీ అమలు చేయకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో అసంతృప్తికి కారణమవుతోందని పేర్కొన్నారు. సీపీఎస్ రద్దుతో పాటు అన్ని ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేసి పెండింగ్‌లో ఉన్న పదోన్న తులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమా లు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్య క్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు భగవాన్ రెడ్డి, బండ రమేష్, వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా సహా ధ్యక్షుడు సమ్మిరెడ్డి, ఎస్.ఎస్. విన్ శర్మ, జిల్లా కార్యదర్శి చంద్రకళ, మండల నాయకులు సూర్యప్రకాశ్, యమునశ్రీ, యాస్మిన్, మొహినుద్దీన్, రాజ్ మహమ్మద్‌తో పాటు వివిధ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.



# క్యాతంపల్లిలో ఘనంగా పల్లా రాజేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**ధర్మసాగర్,జులై11(తెలంగాణ ముచ్చట్లు):**

ధర్మసాగర్ మండలంలోని క్యాతంపల్లి గ్రామంలో జనగామ శాసనసభ్యుడు డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలను మాజీ ఉపసర్పంచ్ కురుస పల్లి రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ .... పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడని కొనియా డారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ రషీద్, గంగారపు వెంకటస్వా మి, కురుసపల్లి యాదగిరి, కురుసపల్లి కొమురయ్య, షేక్ ఖాదర్, గోరుకొంటి సాంబరాజు, మహమ్మద్ రషీద్‌తో పాటు గ్రామస్తులు, మహిళలు పాల్గొని పల్లా రాజేశ్వర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# అవకాశాలను వదులుకున్న నాగదుర్గ

**హైదరాబాద్, జులై 11 (తెలంగాణ ముచ్చట్లు):**

జానపద గీతాలు, నృత్య ప్రదర్శనలతో ప్ర త్యేక గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ ప్రస్తు తం సినీ రంగంలోనూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకునే ప్రయత్నంలో ఉంది. ఇప్పటికే తెలుగు, తమిళ చిత్రాల్లో అవకాశాలు అందుకున్న ఆమె, తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో గతంలో వచ్చిన పలు సినీ అవకాశాలను తానే తిరస్కరించినట్లు వెల్లడించి ఆసక్తి రేపింది.

ఇప్పటికే తెలుగు చిత్రం 'కలివి వనం'లో నటించిన నాగదుర్గ, తమిళంలో ధనుష్ మేనల్లుడితో కలిసి 'లవ్ ఓ లవ్' చిత్రంలో నటిస్తోంది. అలాగే నటుడు ప్రియదర్శి కథా నాయకుడిగా రూపొందుతున్న 'ఇడుపు కాయితం' చిత్రంలో కథానాయికగా ఎంపికైంది. దీంతో జానపద కళాకారిణిగా గుర్తింపు పొందిన ఆమె, ఇప్పుడు వెండితెరపై కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన నా గదుర్గ, గతంలో పలు ప్రముఖ చిత్రాల్లో నటించే అవకాశాలు వచ్చినప్పటికీ వాటిని స్వయంగా వదులుకున్నానని తెలిపింది. నటుడు నాని కథానాయకుడిగా వచ్చిన 'శ్యామ్ సింగరాయ్' చిత్రంలో ఒక ముఖ్య మైన పాత్రతో పాటు, 'అశోకవనంలో అర్జున కళ్యాణం' చిత్రంలోనూ అవకాశం వచ్చిం దని వెల్లడించింది. అలాగే పవన్ కల్యాణ్, సాయి ధరమ్ తేజ్ కలిసి నటించిన 'బ్రో' చిత్రంలో సోదరి పాత్ర కోసం కూడా చిత్ర బృందం తనను సంప్రదించిందని చెప్పింది. సినిమాలతో పాటు పలు టెలివిజన్ ధారా వాహికల్లో ప్రధాన పాత్రలు పోషించే అవ కాశాలు వచ్చినా వాటిని కూడా తిరస్కరిం చినట్లు నాగదుర్గ తెలిపింది. ఆ సమయంలో తన పూర్తి దృష్టి నాట్యంపైనే ఉండేదని, కూచిపూడి నృత్యంలో డాక్టరేట్ సాధించా లన్న లక్ష్యంతోనే సినీ అవకాశాలను అంగీ కరించలేదని వివరించింది.

నాట్యానికి ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో నే అప్పట్లో వచ్చిన అవకాశాలను వదులుకు న్నానని, ఇప్పుడు సరైన కథలు, పాత్రలు వస్తే నటించడానికి సిద్ధంగా ఉన్నానని నాగదుర్గ పేర్కొంది. ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్న ఆమె సినీ ప్రయాణంపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

# ఓటీటీ కంటెంట్‌పై కొత్త నిబంధనల దిశగా కేంద్రం

**న్యూఢిల్లీ, జులై 11 (తెలంగాణ ముచ్చట్లు):**

దేశంలో డిజిటల్ వేదికల్లో ప్రసారమవు తున్న చిత్రాలు, వెబ్ ధారావాహికలపై పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తు న్నట్లు సమాచారం. ప్రస్తుతం అమల్లో ఉన్న సమాచార సాంకేతిక నిబంధనలు-2021 స్థానంలో మరింత కఠినమైన విధానాన్ని తీ సుకురావాలనే అంశంపై కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం డిజిటల్ వేదికల్లో విడుదలయ్యే చిత్రాలు, వెబ్ ధారావాహికలకు థియేటర్లలో విడుదలయ్యే సినిమాల మాదిరిగా ముందస్తు ధ్రువీకరణ ఉండదు. సమాచార సాంకేతిక నిబంధనల ప్రకారం ఆయా సంస్థలు స్వీయ నియంత్రణ విధానాన్ని అనుసరిస్తూ, వయో పరిమితి ఆధారంగా కంటెంట్‌ను వర్గీకరిం చి ప్రసారం చేస్తున్నాయి.

అయితే ఇటీవల కొన్ని డిజిటల్ చిత్రాలు, వెబ్ ధారావాహికల్లో అభ్యంతరకర దృశ్యాలు, అసభ్య పదజాలం, వివాదాస్పద రాజకీయ, సామాజిక అంశాలు పెరుగుతున్నాయనే ఫి ర్యాదులు ప్రభుత్వానికి అందినట్లు తెలుస్తోం ది. ఈ నేపథ్యంలో డిజిటల్ వేదికల్లో నేరుగా విడుదలయ్యే చిత్రాలపై కూడా ముందస్తు పరిశీలన అవసరమనే అభిప్రాయం బలప డుతోంది.

ఈ క్రమంలో డిజిటల్ వేదికల్లో విడుదల య్యే చిత్రాలకు కూడా కేంద్ర చలనచిత్ర ధ్రువీకరణ వ్యవస్థ అనుమతి తప్పనిసరి చేయాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అలాగే వెబ్ ధారావాహికలను కూడా ఇదే పరిధిలోకి తీసుకురావాలా అనే అంశంపై కేంద్ర ప్రభుత్వం వివిధ వర్గాలతో, సంబంధిత శాఖలతో సంప్రదింపులు జరు పుతోంది.

ఈ ప్రతిపాదనలు అమల్లోకి వస్తే డిజిటల్ వే దికల్లో ప్రసారమయ్యే కంటెంట్‌పై మరింత నియంత్రణ ఏర్పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. మరోవైపు, సృజనాత్మక స్వే చ్ఛపై ప్రభావం పడే అవకాశముందంటూ సినీ, డిజిటల్ రంగాలకు చెందిన పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in